క్లుప్తంగా

యోగా భవన్ ప్రారంభం



యోగా భవన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట(పోలాకి): నరసన్నపేట పట్టణంలోని పెద్దపేట సమీపంలో నిర్మించిన యోగా భవన్‌ను నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగాకు మన జీవన విధానంలో ప్రత్యేక సమయం కేటాయించాలన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. నరసన్నపేటలో యోగాభవన్ ఏర్పాటు చేయటం పట్ల ఎమ్మెల్యేను నిర్వాహకులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చింతు రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పొట్నూరు సాయిప్రసాద్, సర్పంచ్ బురెల్లి శంకర్, యోగాసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

హిరమండలం: తమ సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. జీతాలు సక్రమంగా చెల్లించడంతోపాటు అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు శనివారం ఎంఈఓ-2 టి.షణ్ముఖరావుకు సమ్మె నోటీసులు అందజేశారు. 11వ తేదీ నుంచి సమ్మెకు దిగుతున్నట్టు పేర్కొన్నారు.

12 మంది జూదరుల అరెస్టు

హిరమండలం: మండలంలోని గులుమూరు పంచాయతీ జగన్నాథపురంలో పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి దాడి చేశారు. 12 మంది జూదరులను అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ.14,600 నగదును స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు శిబిరంపై దాడిచేసినట్టు ఎస్‌ఐ జి.నారాయణస్వామి శనివారం తెలిపారు. ఎక్కడైనా పండుగల పేరిట జూదం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీముఖలింగంలో శివస్వాముల సందడి



శ్రీముఖలింగం సన్నిధిలో శివస్వాములు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో శివస్వాములు ఆదివారం ఇరుముడులు విరమణ చేశారు. శరన్నవరాత్రులు అనంతరం మాల ధరించారు. మండలి దీక్ష అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. వంశధార నదిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారికి మొక్కులు తీర్చి తలనీలాలు సమర్పించారు. విజయనగరం, బలిజిపేట, డెంకాడ, విశాఖపట్నం నుంచి స్వాములు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

12న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ఆమదాలవలస: ఈ నెల 12వ తేదీన ఆమదాలవలస విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఈఈ ఎస్.భయ్యన్నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోరం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో వినియోగదారులు విద్యుత్ సమస్యలను విన్నవించుకోవచ్చునని పేర్కొన్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం

- జేసీ ఎం.నవీన్



అధికారులు, రైతులతో మాట్లాడుతున్న జేసీ నవీన్

జలుమూరు: రైతులు పండించిన ధాన్యం విక్రయాలలో ఇబ్బంది లేకుండా అధికారులు చూడాలని, రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తామని జేసీ ఎం.నవీన్ అన్నారు. జలుమూరులో ధాన్యం కొనుగోలును శనివారం పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. గ్రామంలో కళ్లాలు, రోడ్లపై నిల్వ ఉన్న ధాన్యాన్ని వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. మిల్లులకు ధాన్యం రవాణా చేస్తే బ్యాంక్ గ్యారెంటీలు లేవని మిల్లర్లు చెబుతున్నారని జేసీ దృష్టికి రైతులు తెచ్చారు. దీనిపై జేసీ స్పందించి నరసన్నపేట, సారవకోట మండలాల మిల్లులకు ధాన్యాన్ని తరలించి రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని వివరించారు. డీఎం శ్రీనివాసరావు తహసీల్దార్ సత్యం, ఏఓ కె.సురేష్‌కుమార్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయండి

- పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పాతపట్నం: ఈ నెల 13న పాతపట్నంలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ నాయకులతో శనివారం సాయంత్రం యాత్ర సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ మూడో విడత యాత్రలో భాగంగా పాతపట్నం నియోజకవర్గంలో బస్సు యాత్ర ఉంటుందన్నారు. 2024లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించాలన్నారు. ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయం కోసం కష్టపడాలన్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ బస్సు యాత్ర నవతల నుంచి ప్రారభం అవుతుందన్నారు. యాత్రకు గ్రామ స్థాయి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు జెడ్పీటీసీ కె.భాగ్యవతి, పాతపట్నం, కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి, ఎల్.ఎన్.పేట పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.శ్యామ్‌సుందరరావు, సీహెచ్ సూర్యనారాయణ, ఎ.వి.సురేష్, బాలరాజు, కృష్ణ, ఏఎంసీ చైర్మన్ అర్జునరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.ప్రదీప్, నాయకులు వై.సూర్యం, ఎస్.ప్రసాద్, యోగి, ఉదయ్‌కుమార్, రెడ్డి రామారావు, విష్ణుమూర్తి, జయమునిరావు, రామకృష్ణ, జి.సూర్యం, వెంకటరమణ, చంద్రయ్య, మాధవరావు, తాతయ్య, గణపతిరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ధ్వజం



అధికారుల గైర్హాజరుపై ప్రశ్నిస్తున్న సభ్యులు

ఆమదాలవలస రూరల్: మండల స్థాయి సమావేశానికి ప్రతీసారి అధికారులు గైర్హాజరు కావడంతో జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తమ్మినేని శారద అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశానికి పలు శాఖల అధికారులు పూర్తిగా రాకపోవడంపై పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ప్రశ్నించారు. దీనిపై స్పందించిన మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు తీర్మానం చేసి ఫిర్యాదు చేస్తామని తెలియజేశారు. గత వర్షాకాలంలో సాగునీరు లేక పంటలు ఎండిపోయాయని, ఇటీవల కురిసిన వర్షం పంటలు నీటమునిపోయాయని దీనిపై స్పందించాల్సిన ఇరిగేషన్‌శాఖ ఏఈ రాకపోవడం, ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన జేఈ రాకపోవడంపై సభ్యులు నిలదీశారు. మండల పాలకవర్గం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఒక్క సమావేశానికి ఆర్‌అండ్‌బీ శాఖ రాకపోవడంపై మండిపడ్డారు. ప్రస్తుతం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రారంభం జరుగుతున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎంపీటీసీ సభ్యుడు అన్నెపు భాస్కరరావు తెలిపారు. దీనిపై స్పందించాల్సిన సివిల్ సప్లయి డీటీ గైర్హాజరు కావడంతో సమాధానం చెప్పేవారు కరువయ్యారు. పలు గ్రామాలకు జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిల ద్వారా నీరు రావడం లేదని సభ్యులు తెలియజేశారు. నాడు-నేడు పథకం ద్వారా అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాలల వద్ద మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటుచేయాలని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను విడతలు వారీగా పరిష్కరించడం జరుగుతుందని ఎంపీపీ తెలిపారు. మరలా ఏర్పాటు చేయనున్న సమావేశానికి మండలస్థాయి అధికారులు పూర్తిసమాచారంతో హాజరుకాకుంటే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఈఓపీఆర్డీ డి.గోవిందరావు, ఏఓ ఎం.మోహనరావు, ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు కూటికుప్పల ఉషారాణి, తాండ్ర లక్ష్మి, కొల్లి యమున, పొన్నాడ అనసూయ, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వెలుగు సిబ్బంది పనితీరుపై సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

కొత్తూరు: మండలంలోని వెలుగు సిబ్బంది పనితీరుపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీఓ ఎం.పావని నిర్వహించారు. గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ కమిటీల ఏర్పాటులో వెలుగు ఏపీఎంతోపాటు సిబ్బంది.. ప్రజాప్రతినిధులు, గ్రామ సమాఖ్య అధ్యక్షులకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఇకనుంచి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే ఏపీఎంపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వైస్‌ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. అటవీశాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను అటవీశాఖ అధికారులు పెద్దిన యశశ్వి, ఉమామహేశ్వరావు వివరించారు. జాబ్‌కార్డులు మరో గ్రామానికి మార్పు చేయడం సరికాదని ఏపీఓ ప్రేమలతకు వైస్ ఎంపీపీ ప్రశ్నించారు. మెట్టూరు బిట్-3 ఆర్ ఆర్ కాలనీలో విద్యుత్ లైన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని సర్పంచ్ శ్రీనివాసరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష , ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్న సేవలను వైద్యాధికారులు పెద్దిన ప్రసన్నకుమార్, రాంబాబు వివరించారు. అంగన్‌వాడీలకు మంజూరైన నాడు-నేడు నిధులు వివరాలను సూపర్‌వైజర్ సూధారాణి వెల్లడించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు అంపిలి ప్రశాంత్, ఈఓపీఆర్డీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరింత చేరువకావాలి

- జెడ్పీ సీఈఓ వెంకట్రామన్



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్రామన్

కొత్తూరు: గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రజలకు మరింత చేరువకావాలని జెడ్పీ సీఈఓ రావాడ వెంకట్రామన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో ఐటీడీఏ పరిధిలో ఉన్న గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు ఇస్తున్న శిక్షణ తరగతులను శనివారం పరిశీలించారు. ప్రజలు అందజేసిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజలకు నమ్మకం కలిగేలా సేవలు అందించాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ప్రతీ ఉద్యోగి సేవకుడిగా భావించినప్పుడే గ్రామ సచివాలయ వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం కలుగుతుందన్నారు. సమయపాలన పాటించాలన్నారు. ప్రజలనుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పనిచేయాలన్నారు. తహసీల్దార్ చక్రవర్తి, ఎంపీడీఓ పావని, ఏఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో జెడ్పీ సీఈఓ, పాతపట్నం నియోజవర్గం ఈఆర్‌ఓ వెంకట్రామన్ సమావేశం నిర్వహించారు. మండలంలోని పది పోలింగ్ స్టేషన్లలో ఓట్ల తొలగింపులు ఎక్కువగా ఉన్నందున వాటికి సంబంధించిన వివరాలను బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్ల నుంచి సేకరించారు. తొలగింపులు పక్కాగా ఉండాలన్నారు. ఓటరు మరోచోటకు ఫారం-8ని నమోదు చేసి పేరును బదిలి చేసినప్పుడు.. సాంకేతికపరంగా ఓటు తొలగింపు కింద ఫారం-7 నమోదు కావడంతో మండలంలో ఎక్కువగా తొలగింపులు ఉన్నట్లు గుర్తించారు.

గణితంతో ఉజ్వల భవిష్యత్



పోలాకి: నరసన్నపేట మండలం ఉర్లాంలో గణిత క్విజ్ విజేతలతో పాఠశాల సిబ్బంది

హిరమండలం: గణితంతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ-2 షణ్ముఖరావు అన్నారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గణిత క్విజ్ పోటీలను శనివారం ప్రారంభించారు. గణితంపై పట్టు సాధిస్తే నిజ జీవితంలో సైతం ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుందన్నారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కేశవరావు పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఫోరం ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో సీనియర్ విభాగంలో తాడివలస జెడ్పీహెచ్‌ఎస్, ద్వితీయ స్థానంలో కింతలి జెడ్పీహెచ్‌ఎస్, మూడో స్థానంలో పిల్లలవలస జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో ఏపీ మోడల్ స్కూల్, ద్వితీయ స్థానంలో తాడివలస, మూడో స్థానంలో పొందూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. విజేతలకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వెంకటరావు, నిర్వాహకులు తేజేశ్వరరావు, దివ్య, హరిప్రసన్నలు అందజేశారు.

నరసన్నపేట(పోలాకి): నరసన్నపేట మండలంలోని ఉర్లాం ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం మండల స్థాయి గణిత క్విజ్ పోటీలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో 10 పాఠశాలలు పోటీల్లో పాల్గొన్నాయి. సీనియర్స్‌లో విజేతలు వరుసగా బోర్డ్‌స్కూల్ నరసన్నపేట, ఉర్లాం జెడ్పీహెచ్‌స్కూల్, మాకివలస, జూనియర్స్‌లో మడపాం, మాకివలస, కంబకాయ విద్యార్థులు నిలిచారు. విజేతలకు హెచ్‌ఎం హర్షవర్ధన్, సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి అవార్డులు అందించారు.

జలుమూరు: గణిత మేధావి రామానుజమ్ జయంతి పురస్కరించుకుని మండల స్థాయి క్విజ్ పోటీలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు. విజేతలకు ఎంఈఓలు ప్రసాదరావు, మాధవరావు బహుమతులు అందించారు.

ఘనంగా వైఎస్ భారతి పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతిమణి భారతి పుట్టినరోజు వేడుకలను పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. పాతపట్నం, మెళియాపుట్టి మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఎస్.ప్రదీప్, పల్లి యోగి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.ఉదయ్‌కుమార్, సచివాలయ మండల అధ్యక్షుడు సూర్యం, మెళియాపుట్టి పీఏసీఎస్ అధ్యక్షుడు బాలరాజు, పంకజ్ దాస్, గోకవలస రాము, ఎం.రామకృష్ణ, ఎం.పార్వతీశం, ఎం.గంగధర్, సుధాకర్, వరదరాజులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



ఆమదాలవలస రూరల్: భోజనాలు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

ఆమదాలవలస రూరల్: మండలంలోని అక్కులపేట పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యాధికారి బి.వసంత శనివారం వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు హాజరైన గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు, వైద్య సిబ్బందికి అక్కులపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారాన్ని ఏర్పాటు చేశారు. పౌష్టికాహారాన్ని వైద్యాధికారి పంపిణీ చేశారు. ప్రతి నెలా అన్నదానం చేయడం సమితి సేవలకు నిదర్శనమన్నారు. ఈ నెల ఎం.ఉదయ్‌కుమార్ తన తాత జయంతి సందర్భంగా పౌష్టికాహారాన్ని ఏర్పాటు చేశారు. సమితి జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, బొడ్డేపల్లి గోపి, అమ్మాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో ఉన్న గర్భిణుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ఎస్.సునీత, ప్రియాంక అన్నారు. మండలంలోని శ్యామలాపురం గ్రామానికి చెందిన భగవాన్ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు, భజన మండలి కన్వీనర్ ఎ.నారాయణరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం గర్భిణులకు పౌష్టికాహార కిట్లును అందజేశారు. పాలకొండకు చెందిన చేపేన వినోద్, సౌజన్యలు పౌష్టికాహార కిట్లను సమకూర్చారు.

ఓటర్ జాబితాపై ఫిర్యాదు

కొత్తూరు: మండలంలోని పారాపురం గ్రామ ఓటరు జాబితాపై పాతపట్నం నియోజకవర్గం ఈఆర్వో ఆర్.వెంకట్రామన్‌కు, తహసీల్దార్ చక్రవర్తికి వైఎస్సార్‌సీపీ నాయకుడు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ తోట నందకుమార్ కొత్తూరులో శనివారం ఫిర్యాదు చేశారు. ఓటరు జాబితాలో ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు పేర్లు గ్రామంలోని వేర్వేరు పోలింగ్ బూత్‌లలో ఉన్నాయని తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు ఆడ పిల్లలకు వివాహాలు జరగడంతో వారికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు ఫిర్యాదు చేశారు. ఇటువంటి తప్పిదాలు సరిచేయాలని పలు దఫాలు సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

పీఆర్‌టీయూ నరసన్నపేట కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులతో జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నరసన్నపేట మండల పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నికైంది. సంఘ జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహనరావు అధ్యక్షతన శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా కింజరాపు లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా చింతు వాసుదేవరావు, గౌరవాధ్యక్షునిగా గెడ్డవలస సత్యబాబు ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. మిగిలిన కార్యవర్గాన్ని త్వరలో ఎన్నుకోనున్నట్టు మురళీమోహన్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీకులు చల్లా దుర్గాప్రసాద్, ఇప్పిలి వేణుగోపాలరావు, ఆర్.అప్పలస్వామి, పి.చిన్నికృష్ణ, జి.మల్లేశ్వరరావు, పి.రమేష్, పి.లచ్చునాయుడు, వి.శోభన్‌బాబు, ప్రసన్నలక్ష్మీభవాని, తదితరులు పాల్గొన్నారు.

పాలపోలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



అధికారులకు సూచనలు చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- శాసనసభాపతి తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: పట్టణంలోని పాలపోలమ్మ అమ్మవారి ఆలయం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నానని ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి ఆలయ అభివృద్ధిపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ దేవాలయానికి అన్ని దిశల నుంచి భక్తుల రాకపోకలు సాగేలా చూడాలన్నారు. ఇందుకు ప్రధాన రహదారి నుంచి దేవాలయం వరకు రోడ్డు అనుంధానం పెంచేలా మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. దేవాలయం వద్దకు చేరుకున్న సభాపతికి ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, ఈఈ సుగుణకర్, ఏఈ అప్పలనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండల కేంద్రంలోని పాతపట్నం ఆర్‌బీకే వద్ద వ్యవసాయశాఖ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంచులు, ధాన్యం, రవాణా చార్జీలు రైతుల ఖాతాల్లో 21 రోజుల్లోనే ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఏఓ రవికుమార్ మాట్లాడుతూ సాధారణ రకం ధాన్యం క్వింటాకు రూ.2,183 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మండలంలోని 14 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తహసీల్దార్ కె.రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, డీటీ భీమారావు, ఆర్ఐ భువన్‌కుమార్, ఏఓఓలు భారతి, శారద, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

నేతన్నల సంక్షేమానికి పెద్దపీట

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట (పోలాకి): రాష్ట్రంలో నేతన్నల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకు తగ్గట్లుగానే అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా వారికి లబ్ధిని చేకూర్చిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేట పట్టణంలోని సూర్యనారాయణస్వామి దేవస్థానం ఎదురుగా చౌడేశ్వరి చేనేత సహకార కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అక్కడ పలు వస్త్రాలు, దుప్పట్ల నాణ్యతను పరిశీలించారు. అనంతరం పోటీ మార్కెట్‌లో వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. చేనేత కార్మికులకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతు రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం



పోలాకి: నరసన్నపటలో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న మెజిస్ట్రేట్ హరిప్రియ

నరసన్నపేట(పోలాకి): నరసన్నపేట మున్సిఫ్ జూనియర్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 544 కేసులు పరిష్కరించారు. న్యాయమూర్తి సి.హరిప్రియ సమక్షంలో 394 ఎస్‌టిసి పెట్టీ కేసులతోపాటు మరో 8 రకాల కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కేసులకు రూ.49,08,299 అపరాధరుసుం విధించారు.

పొందూరు: లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడంతో ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందని పొందూరు కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.జ్యోత్స్న అన్నారు. స్థానిక పొందూరు కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 353 కేసులు పరిష్కరించారు. 40 క్రిమినల్ కేసులు, ఒక సివిల్ కేసు, 279 ఎస్‌టీసీ కేసులు, 29 మోటారు వెహికల్ కేసులు, మూడు చెక్‌పోస్టు కేసులు, ఒకటి సమ్మర్ ట్రయిల్ కేసులు ఉన్నాయి. సూపరింటెండెంట్ సత్యనారాయణ, లోక్‌అదాలత్ మెంబర్ కృష్ణారావు, న్యాయవాదులు బి.మంజుల, బ్రహ్మాజీ, కిరణ్‌కుమార్, అశోక్, రామ్మోహన్, సురేష్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి ఆధ్వర్యంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. 509 కేసులు పరిష్కరించినట్లు ఆమె తెలిపారు. 449 కేసుల్లో రూ.2,50,730 అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. సివిల్, క్రిమినల్, పీఎల్‌సీ కేసులు మొత్తం 60 పరిష్కరించామన్నారు. సీనియస్ న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, కింతలి త్రినాథరావు, పి.వరాహనరసింహులు, బి.సీతారాం, వి.రాజేశ్వరరావు, జి.ప్రభాకరరావు, ఎస్.ప్రసాద్‌రావు, బి.మోహన్‌రావు, గోవిందరాజులు, ఆమదాలవలస సీఐ, ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి ఎస్ఐలు పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 398 కేసులను రాజీ చేసి రూ.2,83,910 అపరాధ రుసుం వసూలు చేశారు. ఏపీపీ రఘునాథ్, కొత్తూరు, హిరమండలం, భామిని, సీతంపేట మండలాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: పట్టణం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు కత్తిరించనున్నారు. ఈ మేరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎస్.భయ్యన్నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మేదర వీధి, వన్ వే జంక్షన్, కంద్రపేట, రైల్వే స్టేషన్ రోడ్డు, వారదా వారి క్వార్టర్స్, రైతు బజార్, లక్ష్మీనగర్ వీధి హై స్కూల్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.